కొలువుల కార్ఖానాగా బాసర ఆర్జీయూకేటీ

- ప్రభుత్వ ఇంజినీర్లుగా 100 మందికిపైగా విద్యార్థులు

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): చదువుల తల్లి సరస్వతీ చెంతనే ఉన్న బాసర ఆర్జీయూకేటీ విద్యార్థుల జీవితాల్లో వెలుగులను నింపుతున్నది. ఇంజినీర్లను తయారు చేసే కార్ఖానా అయ్యింది. ఇందులో చదివిన 100 మందికిపైగా విద్యార్థులు ప్రభుత్వశాఖల్లో ఇంజినీర్ ఉద్యోగాలు సాధించారు. 2012-2016 మధ్యకాలంలో బీటెక్ పూర్తిచేసుకున్న వారు ఇటీవల టీజీపీఎస్సీ వెల్లడించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఏఈఈ) ఫలితాల్లో అత్యధిక కొలువులు కైవసం చేసుకున్నారు. వారు శనివారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో సమ్మేళనం నిర్వహించారు. దీనికి 75 మంది ఉద్యోగాలు పొందిన వారు హాజరయ్యారు. ఆర్జీయూకేటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వీ వెంకటరమణ మాట్లాడుతూ.. మాక్‌ఇంటర్వ్యూ, వ్యక్తిత్వ వికాసం, పరీక్షలను ఎదుర్కొనేలా సిద్ధమయ్యేందుకు బాసర ఆర్జీయూకేటీలో పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

'భాషాపండితులకు పదోన్నతులివ్వాలి'

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): భాషాపండితుల అప్‌గ్రేడేషన్‌లో మిగిలిపోయిన వారికి పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ స్టేట్(ఆర్‌యూపీపీ టీఎస్) ప్రభుత్వాన్ని కోరింది. సంఘం రాష్ట్రస్థాయి సమావేశాన్ని శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. గెజిటెడ్ హెచ్‌ఎం పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయులకు అడ్డంకిగా ఉన్న 10-2-3 విధానాన్ని రద్దుచేసి, అందరితో సమానంగా జీహెచ్‌ఎం పదోన్నతుల్లో అవకాశం కల్పించాలని రాష్ట్ర అధ్యక్షుడు సీ జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు డిమాండ్ చేశారు.

త్యాగాల వారసత్వాన్ని భవిష్యత్తరాలకు అందిద్దాం: నర్సిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయుల హక్కుల సాధన పోరులో యూటీఎఫ్ నాయకుల త్యాగాల వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందిద్దామని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఏర్పడి 50 ఏండ్లు పూర్తయిన సందర్భంగా శనివారం దోమల్‌గూడలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులంతా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, ఎస్టీఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు సంయుక్త పాల్గొన్నారు.

వ్యవసాయ మహిళా డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు

హైదరాబాద్, ఆగస్టు10 (నమస్తే తెలంగాణ): వనపర్తి, కరీంనగర్‌లోని బీసీ గురుకుల మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సొసైటీ కార్యదర్శి సైదులు శనివారం ప్రకటనలో వెల్లడించారు. ఈఏపీసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థినులు బీఎస్సీ అగ్రికల్చర్ హానర్స్ కోర్సులో మొదటి సంవత్సరం ప్రవేశాలకు 12 నుంచి 31వరకు<https://mjptbcwreis.telangana.gov.in>లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈఏపీసెట్-2024 ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంకు, రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్ల ఎంపిక ఉంటుందని చెప్పారు. సీటు పొందిన విద్యార్థినులు కాలేజీ హాస్టల్‌లోనే ఉండాలని స్పష్టంచేశారు. వివరాలకు 040-23328266 నెంబర్‌లో సంప్రదించాలని సెక్రటరీ సూచించారు.

సిరిసిల్లలో అరుదైన ఖనిజ సంపద!

లాంథనైడ్ నమూనా

గనుల శాఖ అన్వేషణ

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : సాగునీటి వనరులు, ఇసుక రీచ్‌లు ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లా అరుదైన ఖనిజ సంపదకు కేంద్ర బిందువు కానున్నది. తాజాగా ఈ సంపద వెలుగు చూడటంతో రాష్ట్ర గనుల శాఖ మరింత పరిశోధన దిశగా అడుగులు వేస్తున్నది. కొత్తగా వేస్తున్న కొత్తపల్లి-మనోహరాబాద్ రైలు మార్గం తవ్వకాల్లో ఈ ఖనిజ సంపద బయటకు రావడంతో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సర్వే చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరింది. కేసీఆర్ కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కార్మిక క్షేత్రమైన సిరిసిల్ల, ధార్మిక క్షేత్రమైన వేములవాడ ప్రజల కోరిక మేరకు కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వేలైన్ మంజూరు చేయించారు. మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు లైన్ పూర్తి కావడంతో సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు మట్టి నమూనాలను సేకరించి పరీక్షించారు. అందులో అత్యంత అరుదైన ఖనిజ సంపద ఉన్నట్టు గుర్తించిన అధికారులు లోతైన పరిశోధన మొదలుపెట్టారు. రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో ఖనిజ సంపద ఉన్నట్టు గుర్తించిన గనుల శాఖ కేంద్రానికి నివేదికలు పంపించినట్టు తెలిసింది. సిరిసిల్ల జిల్లాలో ఈ ఖనిజ సంపద 562.47 చదరపు కిలోమీటర్లు ఉండగా, సిద్దిపేట జిల్లాలో మరికొంత భాగం ఉన్నట్టు గనుల శాఖ అధికారులు తెలిపారు. అందులో 15 రకాల లాంథనైడ్స్ ఉండగా, స్కాండియం, వైట్రియం ఖనిజాలు ఉన్నట్టు వారు పేర్కొన్నారు. కిలో రూ.32 వేలకుపైగా విలువ చేసే వైట్రియం ప్రధానమైనది కావడంతో మరింతగా పరిశోధనలు చేసేందుకు గనుల శాఖ సన్నద్ధమవుతున్నది. సిద్దిపేట జిల్లా వితలాపూర్, సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని పెద్దలింగాపూర్, బస్వాపూర్, లక్ష్మీపూర్ గుట్టల్లోనూ పరిశోధనలు చేస్తే ఇంకా అరుదైన ఖనిజ సంపద బయటపడే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

స్కాండియం నమూనా

వైట్రియం నమూనా

బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టాలి

- కేంద్రంపై బీజేపీ ఎంపీలు ఒత్తిడి తేవాలి
- మల్కాన్‌గిరి రైల్వేలైన్‌తో ఐరన్ ఓర్ తరలింపు సులభం
- రైల్వేలైన్లకు అనుగుణంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి డిమాండ్

శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు రాజేందర్

హైదరాబాద్, ఆగస్టు 10(నమస్తే తెలంగాణ): కేంద్రం కొత్తగా మంజూరు చేసిన పాండురంగాపురం-మల్కాన్‌గిరి కొత్త రైల్వేలైన్ బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ అవసరాలు తీర్చేలా ఉన్నదని, కేంద్రం ఇప్పటికైనా బయ్యారంలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, ఇందుకోసం తెలంగాణ బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్‌చేశారు. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీకి అవసరమైన ఐరన్ ఓర్‌ను తరలించేందుకు ఈ రైల్వేలైన్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కొత్త రైల్వేలైన్, ఐరన్‌ఓర్‌ను గుజరాత్‌కు తరలించే ఆలోచన చేయడం తగదని సూచించారు. ఇక్కడ రైల్వేలైన్లకు అనుగుణంగా మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ ఖమ్మం నేత దిండిగల రాజేందర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కేంద్ర క్యాబినెట్ శుక్రవారం 173 కిలోమీటర్ల పాండురంగాపురం (భద్రాచలం)-మల్కాన్‌గిరి రైల్వేలైన్‌కు అనుమతి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, ఇది మంచి లైన్ అంటూ అభివర్ణించారు. ఈ రైల్వేలైన్‌ను తెలంగాణ ఓ కోణంలో వినియోగించుకోవాలని ఆలోచిస్తుంటే మోదీ మరోకోణంలో ఆలోచిస్తున్నారని తెలిపారు. 'బయ్యారం ఉక్కు తెలంగాణ హక్కు' అనే నినాదంతో ఉద్యమం కొనసాగిందని, విశాఖ కంటే బయ్యారానికే ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్లా దగ్గరవుతుందని, బయ్యారానికి రైల్వేలైన్ చాలా కీలకమైందని, ఎన్ఎండీసీ అధికారులు ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటుకు రైల్వేలైన్ కావాలని అడిగారని, దీని ద్వారా ఫ్యాక్టరీకి ప్రధాన రవాణా సౌకర్యం కలుగుతుందని చెప్పారు. 2017లో కేంద్రం ఉక్కు పాలసీ ప్రకటించిందని, 2030 నాటికి తలసరి ఉక్కు వినియోగాన్ని ప్రతి వ్యక్తి 158 కిలోలు వాడే విధంగా ప్రోత్సహించాలని నిర్ణయించిందని గుర్తుచేశారు. బయ్యారంలో తెలంగాణ స్టీల్ ప్లాంట్ పెడితేనే తలసరి వినియోగ అవసరాలను తీర్చేలా ఉత్పత్తి జరుగుతుందని చెప్పారు. కొత్త రైల్వేలైన్ ఖనిజ సంపదను గుజరాత్ తరలించేందుకు ఉపయోగపడేదిగా మారకూడదని తెలిపారు. బయ్యారంలో మూడు మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పాదక ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని గతంలోనే స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదించిందని, ఈ ఫ్యాక్టరీ వస్తే నాలుగు వేల మందికి ప్రత్యక్షంగా, పదివేల మందికి పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. పదేండ్లుగా కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా తెలంగాణలో భారీ పరిశ్రమలకు మోదీ పది పైసలైనా ఇచ్చారా? అంటూ ప్రశ్నించారు.

రాష్ట్రంలో కొత్తగా ఆరు రైల్వే లైన్లు!

- ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.26 వేల కోట్లు
- త్వరలో ప్రారంభం కానున్న నిర్మాణ పనులు

హైదరాబాద్, ఆగస్టు 10(నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంతంలో 6 మేజర్ రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిసింది. అందుకోసం రూ.26,000 కోట్ల వ్యయం అవుతుందని రైల్వే అధికారులు అంచనాలు సిద్ధంచేశారు. కొత్త ప్రాజెక్టులో భాగంగా భద్రాచలం-మల్కాన్‌గిరి రైల్వే స్టేషన్ల మధ్య నూతన రైల్వే మార్గం నిర్మించబోతున్నట్టు కేంద్రం తాజాగా ప్రకటించింది. ఈ లైన్ దూరం 170 కిలోమీటర్లుగా ఉంటుంది. అందులో ఏపీలో 85.55 కిలోమీటర్లు ఉండగా, తెలంగాణలో 20 కిలోమీటర్ల వరకు ఉంటుంది. మిగతాది ఒడిశాలో ఉండనున్నది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.7,383 కోట్ల వ్యయాన్ని అంచనా వేశారు. వచ్చే రెండు నెలల్లో ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వేమంత్రి అశ్వినివైష్ణవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం న్యూఢిల్లీ నుంచి వర్చువల్ ద్వారా మీడియాతో మాట్లాడారు.పాండురంగాపురం - భద్రాచలం-మల్కన్‌గిరి ప్రాంతాల మధ్య నూతన రైల్వే లైను ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందని వెల్లడించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ నుంచి ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్, సీపీఆర్వో శ్రీధర్ పాల్గొన్నారు.

ఇతర రైల్వే లైన్లు ఇవీ..

- డోర్నకల్-గద్వాల మధ్య 296 కిలోమీటర్ల దూరం నూతన రైల్వే లైను నిర్మాణాన్ని త్వరలో చేపట్టబోతున్నట్టు సమాచారం. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.5 వేల కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు.
- డోర్నకల్-మిర్యాలగూడ మధ్య 105 కిలోమీటర్ల మేరకు నూతన రైల్వే లైనును నిర్మించబోతున్నారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.2,100 కోట్లగా అంచనా వేశారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.
- కాచిగూడ(ఉందానగర్)-జగ్గయ్యపేట ప్రాంతాలను కలిపి నూతన రైల్వే మార్గం నిర్మాణం కాబోతున్నది. ఇది నేషనల్ హైవే 65 అంటే హైదరాబాద్-విజయవాడ రహదారికి సమాంతరంగా నూతన రైల్వే మార్గం. 228 కిలోమీటర్ల పొడువు ఉంటుంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.4,600 కోట్లు డీపీఆర్‌లో ప్రతిపాదించారు.
- రామగుండం-మణుగూరు ప్రాంతాలను కలుపుతూ 207 కిలోమీటర్ల మేరకు నూతన రైల్వే మార్గం నిర్మించబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. రెండు, మూడు నెలల్లో తుది అనుమతులు మంజూరు కానున్నాయి. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.4,100 కోట్లుగా అంచనా వేశారు.
- నాగులపల్లి-నిజామాబాద్-ఆదిలాబాద్ ప్రాంతాలను కలుపుతూ మరో నూతన రైల్వే మార్గం ప్రాజెక్టుకు త్వరలోనే కేంద్రం ఆమోదం తెలపనున్నది. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దాదాపు 316 కిలోమీటర్ల మేర నూతన రైలు మార్గం నిర్మాణం కాబోతున్నది. ఇందుకు రూ.6,400 కోట్లు ఖర్చు అవుతాయని అధికారులు అంచనా వేశారు.

ఒకటికి రెండు ఉంగరాలైతయ్!

- *ఓ హోటల్ యజమానిని మోసం చేసే యత్నం*
- *దొంగబాబాలకు దేహశుద్ధి*

పరిగి, ఆగస్టు 10: చెంబులో ఒక్క ఉంగరం వేసి.. దేవుడి దగ్గరపెట్టి మరుసటి రోజు చూస్తే రెండు ఉంగరాలు అవుతాయని ఓ హోటల్ యజమానిని మోసగించేందుకు యత్నించిన దొంగబాబాలకు గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. అనంతరం వారిని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన శనివారం వికారాబాద్ జిల్లా పరిగి మండలం నస్కల్ గ్రామంలో చోటుచేసుకుంది. నస్కల్ గ్రామంలో మాలి కాడి శ్రీధర్ హోటల్ నడిపిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం నలుగురు వ్యక్తులు హోటల్‌కు వచ్చారు. ముగ్గురు కాషాయ దుస్తులు ధరించి స్వామీజీల్లా ఉన్నారు. భోజనం చేశాక యజమాని వారిని డబ్బులు అడిగితే.. 'మేము స్వామీజీలం, మమ్మల్ని డబ్బులు అడగొద్దు, మీకు అంతా మంచి జరిగేలా చేస్తాం' అని నమ్మబలికారు. చిన్న చెంబులో నీళ్లు తీసుకురమ్మన్న స్వామీజీలు.. శ్రీధర్ బంగారు ఉంగరాన్ని అందులో వేయించారు. ఆ చెంబుకు తెల్లటి వస్త్రం కట్టి దేవుడి ముందు ఉంచాలని, దానిని మరుసటి రోజు (ఆదివారం) చూస్తే.. రెండు ఉంగరాలు అవుతాయని శ్రీధర్‌కు చెప్పారు. దీంతో చెంబులో చూడగా రాయి ఉన్నది. తనను ఎందుకు మోసం చేశారని ప్రశ్నించగా.. శూలాన్ని శ్రీధర్‌పైకి విసిరారు. శ్రీధర్ తప్పించుకొనే క్రమంలో కిందపడిపోగా ఎడమచేతికి గాయమైంది. వెంటనే గ్రామస్థులు వారిని చితకబాది పరిగి పోలీసులకు అప్పగించారు. వారు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రావత్‌నాథ్, మిట్టనాథ్, మేఘనాథ్, డ్రైవర్ రాజేందర్‌గా పోలీసులు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేశారు.


వాహనంలో దొంగబాబాలు

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటలో రైతులతో కలిసి కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బలవంతపు భూసేకరణను ప్రతిఘటిస్తాం

ప్రభుత్వానికి ప్రజా సంఘాల నాయకుల హెచ్చరిక

బొంరాస్‌పేట, ఆగస్టు 10: రైతులు, పేదల అనుమతి లేకుండా ఫార్మా కంపెనీల కోసం సాగు భూములను బలవంతంగా సేకరించడానికి ప్రయత్నిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం దుద్యాల మండలం హకీంపేటలో రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీల కోసం హకీంపేట గ్రామంలో 505 ఎకరాలు, పోలేపల్లిలో 130 ఎకరాలు, లగచెర్ల, పులిచెర్లకుంట తండా, రోటిబండ తండాలో 643 ఎకరాల భూమిని సేకరించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని చెప్పారు. కొడంగల్ నియోజకవర్గంలో 1,154 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి అన్యాక్రాంతమైందని, అధికారులు ఆ భూముల జోలికిపోకుండా పేదలు, సన్న, చిన్నకారు రైతులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని ఆరోపించారు. ధరణి, ప్రభుత్వ, అసైన్డ్ భూముల సమస్యలను పరిష్కరించాలని కొడంగల్ పట్టణంలోని రెడ్డిబసిరెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 13న జిల్లా స్థాయి భూసదస్సు నిర్వహిస్తామని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు హకీంపేటలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మల్లేశం, నర్సింహులు, బసప్ప, నారాయణ, వెంకటయ్య, మణికంఠగౌడ్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుపై జాతీయ ఉద్యమం

- 13, 14న హైదరాబాద్‌లో కీలక సమావేశాలు
- పోరాటానికి సిద్ధమవుతున్న ఏఐఎస్‌జీఈఎఫ్

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల పాలిట గుదిబండలా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) రద్దుపై జాతీయస్థాయిలో ఉద్యమానికి ఉద్యోగ సంఘాలు సమాయత్తమవుతున్నాయి. ఆదాయపు పన్ను పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలన్న ప్రధాన డిమాండ్‌తో పోరాటానికి సిద్ధమవుతున్నాయి. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) హైదరాబాద్ వేదికగా జాతీయస్థాయిలో కార్యాచరణను ప్రకటించనుంది. 13, 14న ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ సమావేశాలు హైదరాబాద్‌లో జరగనున్నాయి. జాతీయ అధ్యక్షుడు సుభాష్ లంబ, ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ సహా పలు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు రెండు రోజుల పాటు సమావేశాల్లో పాల్గొంటారని ఏఐఎస్‌జీఈఎఫ్ ఉపాధ్యక్షుడు, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ తెలిపారు. సీపీఎస్, ఆదాయపు పన్ను పరిమితి పెంపు, పెండింగ్ డీఏల విడుదల, ప్రభుత్వశాఖల్లోని ఖాళీల భర్తీ, ప్రైవేటీకరణ రద్దు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ వంటి అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు.

బెల్లంపల్లిలోని సివిక్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆయా బస్తీల వాసులు

క్వార్టర్లకు విద్యుత్తును పునరుద్ధరించాలి

- సివిక్ కార్యాలయం ఎదుట బస్తీవాసుల ధర్నా

బెల్లంపల్లి, ఆగస్టు 10 : సింగరేణి క్వార్టర్లకు తొలగించిన విద్యుత్తు సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిబస్తీ, కన్నాల బస్తీ, బూడిదగడ్డ బస్తీలకు చెందిన మాజీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని సివిక్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. మూడు రోజుల క్రితం విద్యుత్తు సరఫరాను నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్తు సరఫరా నిలిపివేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చేవరకు సింగరేణి కరెంట్ సరఫరా చేస్తుందని, ఈ మేరకు సింగరేణి సీఎండీతో మాట్లాడినట్టు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఓ ప్రకటనలో తెలిపాపరు.

సురక్షిత సింగరేణిని ఆవిష్కరిద్దాం

సంస్థ సీఎండీ బలరాం

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తి కన్నా కార్మికుల ప్రాణాలు ఎంతో విలువైనవని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. రక్షణ నియమాలు పాటిస్తూ సురక్షిత సింగరేణిని ఆవిష్కరిద్దామని ఆయన ఆకాంక్షించారు. శనివారం 11ఏరియాల్లోని 40గనుల రక్షణ కమిటీలు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, మైన్ కమిటీ సభ్యులు, రక్షణ సూపర్‌వైజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖర్చుకు వెనుకాడకుండా కార్మికులకు రక్షణకు సౌకర్యాలు కల్పిస్తామని స్పష్టంచేశారు. దవాఖానల్లో ప్రత్యేక వైద్యనిపుణులను నియమిస్తున్నామని, రామగుండం ఏరియా హాస్పిటల్‌ను సూపర్ స్పెషాలిటీ దవాఖానగా రూపుదిద్దుతామని హామీఇచ్చారు. డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, డీ సత్యనారాయణరావు, జీ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయ కార్యదర్శి డీఎస్ మృతి

- కూనంనేని, సురవరం, శ్రీనివాస్‌రెడ్డి నివాళి
- భౌతికకాయం మెడికల్ కాలేజీకి అప్పగింత


సీతారామచంద్రా రావు(ఫైల్)

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి, కోశాధికారి ధూళిపాల సీతారామచంద్రరావు (1935-2024) శనివారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని మెడికల్ కాలేజీకి అందజేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి రామచంద్రరావు భౌతికకాయంపై పార్టీ జెండా కప్పారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు, బీవీ విజయలక్ష్మి, సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ డైరెక్టర్ రజిని, భారత మాజీ రాయబారి సురేశ్‌బాబు నివాళులర్పించారు.

హైదరాబాద్‌లో జొయిటిస్ విస్తరణ

- ఈ ఏడాది సెప్టెంబర్ నుంచే ప్రారంభం
- సీఎం అమెరికా పర్యటనలో పలు ఒప్పందాలు



కాలిఫోర్నియాలోని గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థ 'జొయిటిస్' హైదరాబాద్‌లో తమ క్యాపబిలిటీ సెంటర్‌ను విస్తరించాలని నిర్ణయించింది. అమెరికా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు, అధికారుల బృందం పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభిస్తామని జొయిటిస్ తెలిపింది. భారత్‌లో తమ కంపెనీ విస్తరణకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని, తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉన్నదని జొయిటిస్ కంపెనీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సర్ బాగ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణకు మోనార్క్ ట్రాక్టర్స్ కూడా ముందుకొచ్చింది. తమ ఆర్ అండ్ డీ సంస్థకు అనుబంధంగా స్వయంప్రతిపత్తి ట్రాక్టర్ టెస్టింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామని సీఈవో ప్రవీణ్ పెన్మెత్స వెల్లడించారు. దీంతోపాటు తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ముందుకొచ్చింది. స్టాన్‌ఫోర్డ్ బైర్స్ సెంటర్ ఫర్ బయోడిజైన్ విభాగంలోని సీనియర్ ప్రతినిధులతో రాష్ట్ర బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో స్టాన్‌ఫోర్డ్ బయోడిజైన్ శాటిలైట్ సెంటర్ ఏర్పాటుపై చర్చించారు. ఈ మేరకు తగిన సహకారం అందిస్తామని బయోడిజైన్ విభాగం అధిపతులు డాక్టర్ అనురాగ్ మైరాల్, డాక్టర్ జోష్ మాకోవర్ తెలిపారు. ఆసక్తిని వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖను అందజేశారు. కాలిఫోర్నియాలోని మౌంటేన్ వ్యూలో ఉన్న గూగుల్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సీఎం సందర్శించారు. కాలిఫోర్నియా బే ఏరియాలో జరిగిన బిజినెస్ కాన్ఫరెన్స్‌లో ప్రపంచ ప్రఖ్యాత బిజినెస్ కన్సల్టెంట్, రచయిత, వక్త డాక్టర్ రామ్‌చరణ్‌ను కలిశారు. ఆయన అనుభవం తెలంగాణ పురోగతికి తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు.

విపక్షాలు ఏకమైతే 24 గంటల్లో కేజ్రీవాల్ విడుదల

మనీశ్ సిసోడియా

న్యూఢిల్లీ: నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష నేతలంతా ఏకమైతే, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 24 గంటల్లో విడుదలవుతారని ఆ రాష్ట్ర మాజీ సీఎం, ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. 'మనం ఓ రథానికి కేవలం గుర్రాల వంటివాళ్లం, నిజమైన రథసారథి ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఆయన త్వరలోనే బయటకు వస్తారు' అని చెప్పారు. బీజేపీ నేతలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, వారు రాజ్యాంగం కన్నా శక్తిమంతులు కాదన్నారు. ఈ నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. ఈ నియంతృత్వం కేవలం నేతలను జైళ్లలో పెట్టడం మాత్రమే కాకుండా, ప్రజలను వేధిస్తున్నదని చెప్పారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో సిసోడియా శుక్రవారం బెయిలుపై విడుదలైన సంగతి తెలిసిందే.

రాబందులు అంతర్ధానం

- 1980వ దశకంలో 4 కోట్లు.. ఇప్పుడు 326
- విజృంభిస్తున్న వైరస్‌లు, బ్యాక్టీరియాలు
- వ్యాధులతో ప్రజలు సతమతం

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): రాబందులంటే కేవలం పక్షులు మాత్రమే కాదు. పారిశుద్ధ్య పని చేస్తూ మన పరిసరాలు, ప్రకృతిని పరిశుభ్రంగా ఉంచే ఆత్మబంధువులు. ఊరి పొలిమేరల్లో పడేసిన జంతు కళేబరాలను రాబందులు తిని బ్యాక్టీరియా, వైరస్‌ల వ్యాప్తిని అడ్డుకుంటాయి. తద్వారా కలరా, ఆంత్రాక్స్ లాంటి వ్యాధులను నిరోధిస్తాయి. మన దేశంలో రాబందులు వేగంగా అంతరించిపోతున్నాయి. 1980వ దశకంలో దాదాపు 4 కోట్లుగా ఉన్న వీటి సంఖ్య 2015 నాటికి 15 వేలకు పడిపోయింది. ఇప్పుడు దేశవ్యాప్తంగా కనీసం 400 రాబందులు కూడా లేవు. దీంతో వివిధ రకాల వ్యాధులు ప్రబలి 2000-2005 మధ్య కాలంలోనే దాదాపు 5 లక్షల మంది మరణించినట్టు తేలింది. ఆ తర్వాతే రాబందుల వల్ల మానవాళికి జరుగుతున్న మేలు ఏమిటో ప్రపంచానికి తెలిసొచ్చింది. దీంతో భారత్‌లో రాబందుల సంతతిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్య లు చేపట్టింది. ఇంతకీ మన దేశంలో కోట్ల సంఖ్యలో ఉండాల్సిన రాబందుల సంఖ్య కేవలం 35 ఏండ్లలోనే వేలల్లోకి ఎందుకు పడిపోయింది అని లోతుగా పరిశీలిస్తే.. పశువులకు వాడే 'డైక్లోఫినాక్' అనే పురుగుమందు కారణమని తేలింది. ఆ మందు ప్రభావానికి లోనైన జంతువుల కళేబరాలను తినడం వల్లే రాబందులు మరణించినట్టు వెల్లడైంది. దీంతో కేంద్ర ప్రభుత్వం 2006లో 'డైక్లోఫినాక్'ను నిషేధించింది. ప్రజారోగ్య సంరక్షణలో ఎంతో కీలకపాత్ర పోషించే రాబందులు లేకపోతే ప్రపంచం ఆరోగ్య సంక్షోభాలను ఎదుర్కోవాల్సి వస్తుందని, వాటిని అధిగమించేందుకు ఏటా 70 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.5,87,889 కోట్లు) ఖర్చు చేయాల్సి వస్తుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

బెజ్జూర్ ప్రాంతంలో ఆవాసం

ఆదిలాబాద్ జిల్లా బెజ్జూర్ ప్రాంతంలో 26 రాబందులు ఉన్న ట్టు గుర్తించారు. వీటి సంఖ్యను పెంచేందుకు విభుప్రకాశ్, నిఖిత దాదాపు 30 ఏండ్ల నుం చి కృషి చేస్తున్నారు. 'వల్చర్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ఖ్యాతి పొందిన విభుప్రకాశ్‌ను 2021లో కేంద్రం 'ప్రాణిమిత్ర' అవార్డుతో సత్కరించింది